జాడ లేని అంబులెన్స్

- ఆపదొస్తే అంతే సంగతులు
- ప్రైవేటు వాహనాలే దిక్కు



పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెగడపల్లి: ఆపద సమయంలో ప్రజలు అత్యవసరంగా ఉపయోగించుకునే 108 వాహనం అంబులెన్స్ అందుబాటులో లేక మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అకస్మాత్తుగా అనారోగ్యంపాలయినా.. ప్రమాదాలు జరిగినా.. బలవన్మరణానికి ఎవరైనా యత్నిస్తే అందరికీ గుర్తుకొచ్చేది 108 అంబులెన్స్. వెంటనే దానికోసం కాల్ చేస్తారు. పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 అంబులెన్స్ వాహనం లేక రోడ్డు ప్రమాద బాధితులు, క్షతగాత్రులు, కాన్పు సమయంలో మహిళలు అత్యవసర వైద్యం కోసం ఇక్కట్లు పడుతున్నారు. ప్రమాదాలు జరిగినా.. ప్రజలు అనారోగ్యం బారిన పడితే అత్యవసరంగా ఆసుపత్రికి చేర్చేది 108 వాహనం. ఇలాంటి వాహనం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేక ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ముందు అప్పటి ఎంపీ రంజిత్‌రెడ్డి మండలానికి అందించిన అంబలెన్స్ వాహనాన్ని అప్పటి మంత్రి ఈశ్వర్ ప్రారంభించారు. మరుసటి రోజు వాహనం అడ్రస్ లేకుండా పోయింది. 108 వాహనంలో శిక్షితులైన డ్రైవర్, సిబ్బందితోపాటు ఆక్సిజన్, వైద్య పరికరాలు, మందులు ఉండడం, ప్రధాన ఆసుపత్రికి వెళ్లేసరికి ప్రాథమిక చికిత్స అందుతుందని ప్రజల నమ్మకం. ప్రభుత్వ అంబులెన్స్ లేక ఇతర మండలాల నుంచి 108 వచ్చేసరికి ఆలస్యమవుతోందని ప్రజలు వాపోతున్నారు. ఇతర మండలాల నుంచి ఇక్కడికొచ్చి ఉన్నత ఆసుపత్రులకు వెళ్లేసరికి ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలు అనేకమున్నాయి. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా.. నిత్యం 100 మందికి పైగా ఓపీ ఉంటుంది. ఎనిమిది ఉప కేంద్రాలున్నాయి. 45వేల జనాభా వరకుంటుంది. అత్యవసర కిరాయి కారు, ఆటోవాలాలు రావడం లేదు. రాత్రి పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. మండలం కేంద్రం నుంచి జగిత్యాల సుమారు 30 కిలోమీటర్లు, కరీంనగర్‌కు 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడికెళ్లాలంటే ప్రైవేటు అంబులెన్స్ లేదా ఇతర వాహనాలపైనే ఆధారపడుతున్నారు.

అందుబాటులో ఉంచాలి



మండల కేంద్రంలోని ఆసుపత్రిలో 108 వాహనం అందుబాటులో ఉంచాలి. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే రావడానికి గంటల సమయం పడుతోంది.

– చింతకింది కిశోర్, బతికపల్లి

అత్యవసర సమయంలో ఇబ్బందులు



మారుమూల గ్రామంలో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, పాముకాటుకు గురైన సమయంలో, గర్భిణులు సాధారణ ప్రసవాలు కానప్పుడు జిల్లాకేంద్రానికి తీసికెళ్లాల్సి ఉంటుంది. అత్యవసర సమయంలో 108 వాహనం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– భోగ భూమయ్య, పెగడపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి..



స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 108 వాహన విషయమై వైద్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ మేరకు ప్రతిపాదనలు కూడా పంపాం.

– నరేశ్, వైద్యాధికారి, పెగడపల్లి

మంజూరుకు కృషి



పెగడపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 వాహనం సమకూర్చేందుకు కృషి చేస్తున్నా. ఈ వాహన విషయమై మండల ప్రజలు తన దృష్టికి తెచ్చారు. ఇప్పటికే అంబులెన్స్ మంజూరు చేయాలని ప్రభుత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు ప్రతిపాదనలు పంపించాం.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సంక్షేమ శాఖ మంత్రి

క్లుప్తంగా

రేపు ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్

జగిత్యాల: తెలంగాణ వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ వారితో హైదరాబాద్‌లో సివిల్, ఉచిత శిక్షణ కోసం ఈనెల 12న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ శనివారం నిర్వహిస్తున్నట్లు, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో హాజరు కావాలన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

పెగడపల్లి: ఉద్యాన శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్(గోల్డ్ డ్రాప్) ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం సాగు విధానం, యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ తదితర అంశాలపై వివరించారు. ఆయిల్‌పాం క్లస్టర్ అధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మొక్కలకు 90 శాతం, డ్రిప్ పరికరాల ఏర్పాటుకు 80 నుంచి 90 శాతం సబ్సిడీ కల్పిస్తోందన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

పెగడపల్లి: ఎన్నికల విధులు, ఓటరు నమోదుపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. చేర్పులు, మార్పులు, సవరణల ప్రక్రియ, నిబంధనలు తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. తహసీల్దార్ రవీందర్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

బుగ్గారం: వెల్గొండ గ్రామానికి చెందిన రఫీక్ అనే వ్యక్తి అనారోగ్యానికి గురై కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ ఇటీవల మరణించాడు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామ సేవాసమితి సభ్యులు, యువకులు విరాళాలు సేకరించి రూ.35వేలు అందించారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కథలాపూర్: పోసానిపేటలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నవ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దీకొండ శివకుమార్ అనారోగ్యంతో గతంలో మృతిచెందగా.. ఆయన జ్ఞాపకార్థం తోటి మిత్రులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించారు.

లక్ష్యంతో చదివితేనే విజయం

మల్లాపూర్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఒక సమున్నత లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగితే విజయం తమ సొంతమవుతుందని ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం సిరిపూర్, రాఘవపేట ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ పుస్తకాలు, సామగ్రి పంపిణీ చేశారు.

ఆరోపణలు సరికాదు

కొడిమ్యాల: మండల కేంద్రంలో నడుస్తున్న సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల వివాదంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. గడ్డం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులపై వస్తున్న ఆరోపణలపై తన ప్రమేయమున్నట్లు నిరూపిస్తే బాధ్యత వహిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని అన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు



కోరుట్ల: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్

గురు పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పతాకారోహణ, పల్లకీసేవ, భక్తులకు అన్నదానం చేశారు. గురువులను ఘనంగా సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



మెట్‌పల్లి: సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు



రాయికల్: ఇటిక్యాలలో పాల్గొన్న భక్తులు

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

సారంగాపూర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దుపరచి పాత పెన్షన్ విధానం కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలని తపస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ అన్నారు. గురువారం రేచపల్లి, అర్పపల్లి, సారంగాపూర్ తదితర గ్రామాల్లో తపస్ నాయకులు పర్యటించి ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జకిలేటి శ్రీనివాస్‌రావు, అదే గంగారెడ్డి, జిల్లా బాధ్యులు సిరా శ్రీనివాస్, మధు మునీందర్ ఉన్నారు.

బుగ్గారం: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు చేయించారు. తాటిపర్తి దశరథ రెడ్డి, రాపర్తి రాజేశ్, బోడ నంద్యానాయక్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



రేచపల్లిలో సభ్యత్వ నమోదు

డీఎస్సీ నిర్వహించాలి

మల్యాల: రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య అన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు అధికంగా ఉన్నాయని, డీఎస్సీ నిర్వహించి భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, వేంకటేశ్వర్లు, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి హేమలత సూచించారు. మద్దులపల్లి గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించి పశువులకు వ్యాక్సిన్లు వేశారు. ఏఎంసీ చైర్మన్ సత్తిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు రాఘవరెడ్డి, భీరయ్య, సిబ్బంది మధిన్, రైతులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

బుగ్గారం: చిన్నాపూర్ గ్రామంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రముఖ జానపద కళాకారుడు, కవి, రచయిత ఎస్వీ మల్లిక్ తేజ తెలిపారు. వాస్విక్ ఫౌండేషన్ సహకారంతో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందం పర్యవేక్షణలో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు పూర్తి ఉచితంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి సన్మానం

రాయికల్: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఏనుగు రుచితను గురువారం మూటపల్లి గ్రామంలోని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్, ఉపాధ్యాయులు చందు, రాజ్‌కిరణ్, అంజుమ్‌బేగం, ప్రియాంక, శేఖర్ పాల్గొన్నారు.

సారంగాపూర్: రేచపల్లి గ్రామానికి చెందిన ఎనుగందుల శ్రీజ ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా.. గ్రామస్తులు గురువారం అభినందించి సన్మానించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివి 552 మార్కులు సాధించింది.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలు



మేడిపల్లి: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని మేడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు గురువారం నిర్వహించారు. విద్యార్థులకు జనాభా ప్రాధాన్యం, ప్రాముఖ్యం ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు వివరించారు. ఉపన్యాసకులు అనీష్‌రాజు, విశ్వప్రసాద్, సాయికృష్ణ, రాంబాబు, రాజశేఖర్, నాగేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

గరుడ సేవ



కోరుట్ల: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో గురువారం గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆలయ గిరి ప్రదక్షిణ

వెల్గటూర్: కిషన్‌రావుపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం శోభాయమానంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, మహిళలు స్వామివారి నామ సంకీర్తనలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

రేపు శ్రీశైలంకు ప్రత్యేక బస్సు

మెట్‌పల్లి: ఈనెల 12న పట్టణం నుంచి శ్రీశైలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు డీఎం దేవరాజ్ తెలిపారు. శనివారం ఉదయం 4 గంటలకు బస్ స్టేషన్ నుంచి బయలుదేరుతుందని, టికెట్ ధర పెద్దలకు రూ.2,300గా నిర్ణయించామన్నారు.



జగిత్యాలలో..



చింతకుంటలో..

పోచమ్మ బోనాలు

జగిత్యాలటౌన్: పట్టణంలోని బేడ బుడగజంగాల కాలనీవాసులు గురువారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఒగ్గుడోలు కళాకారుల నృత్యాల మధ్య మహిళలు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కైరి అజయ్‌గౌడ్, బండ శంకర్, భూమగౌడ్, బేడ బుడగ జంగాల సంఘం అధ్యక్షుడు చెన్నూరి వెంకటయ్య, భాస్కర్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, రవీందర్, మల్లారెడ్డి, సిరిగిరి వెంకటయ్య, నూనె కనకయ్య పాల్గొన్నారు.

కథలాపూర్: చింతకుంటలో ఒడ్డెర సంఘం ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఇంటికో పోచమ్మ బోనంతో భక్తులు ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి దేవతకు నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవతను పూజించినట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు.

గోరింటాకు సందడి

కోరుట్ల: పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్ వద్ద గల దుర్గాదేవి ఆలయంలో గురువారం సాయంత్రం మహిళలు గోరింటాకు వేడుకను ఘనంగా నిర్వహించారు. చేతులకు గోరింటాకు పెట్టుకొని ఆషాఢంలో గోరింటాకు విశేషాన్ని వివరించారు. డాక్టర్ మధుశ్రీ పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని శ్రీలాస్య ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆషాఢ మాసం గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. పాఠశాలలో మైదాకు సిద్ధం చేసి చేతులకు పెట్టుకొని సందడి చేశారు. ప్రిన్సిపాల్ సుష్మ, కరస్పాండెంట్ రాజు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కోరుట్ల: గోరింటాకు వేడుకలో మహిళలు

క్రికెట్ పోటీలకు ఎంపిక

జగిత్యాల: పట్టణంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జూలై 11 నుంచి 13 వరకు జరగనున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ హరిచరణ్‌రావు తెలిపారు. అండర్–14 విభాగంలో దీక్షిత్, సుమంత్, విష్ణు, సాయి, నికేత్, అండర్–17 విభాగంలో విశాల్, వసూద్, స్వాతిక్, మెహర్‌చంద్ర, అక్రమ్ టెన్నిస్ క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జూన్ 21 నుంచి 23 వరకు మహబూబాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోర్త్ తెలంగాణ టెన్నిస్ క్రికెట్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

పాఠశాల బలోపేతానికి సహకారమందించాలి

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి సహకారమందించాలని మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం కోరుట్ల ఆదర్శ స్కూల్ 1995–96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు విరాళంగా అందించిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు హరిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ పడాల మానస, వీడీసీ చైర్మన్ వంశీ, కోశాధికారి రొద్ద రాజు, నాయకులు మిట్టపెల్లి దివాకర్‌రెడ్డి, గుగ్లావత్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శీత్లాభవాని వేడుకలను సెలవు దినంగా ప్రకటించాలి

రాయికల్: బంజారుల ఆరాధ్య దైవం శీత్లాభవానీ వేడుకలను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని జిల్లా అధ్యక్షుడు గోవిందునాయక్ కోరారు. గురువారం ఆయన రాయికల్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ బంజారాలు ఏటా జూలైలో రెండో మంగళవారం శీత్లాభవాని వేడుకలు నిర్వహిస్తారని, సెలవుదినంగా ప్రకటించడంతో పాటు రాయికల్‌లో ఏకలవ్య పాఠశాలను మంజూరు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌నాయక్, రాయికల్ మండల అధ్యక్షుడు గుగ్లావత్ చిరంజీవి, ప్రధాన కార్యదర్శి భూక్య శేఖర్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

రాయికల్: వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మేరు సంఘ భవనంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. టీబీ హెచ్ఐవీ, మధుమేహం క్షయ తదితర పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ ఆఫీసర్ కస్తూరి సతీశ్, హెచ్ఈవో సాగర్‌రావు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమారాణి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

సారంగాపూర్: పెంబట్ల గ్రామంలో 3 రోజులుగా కురుస్తున్న అడపాదడపా వానకు గురువారం ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన పస్తం స్వప్న నివాసముంటున్న ఇల్లు కూలింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని స్వప్న, ఆమె తండ్రి హన్మంతు, కుటుంబ సభ్యులు వేడుకున్నారు. మండల రెవెన్యూ పరిశీలకుడు వెంకటేశం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విప్‌ను కలిసిన ఎస్సై

మేడిపల్లి: మండలానికి ఇటీవల బదిలీపై వచ్చిన నూతన ఎస్సై శ్రీధర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి పూల మొక్క అందజేశారు.

నేతకానీల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ధర్మపురి: రాష్ట్రంలోని గిరిజన ఆదివాసులతో సమానంగా జీవిస్తున్న నేతకానీల కార్పొరేషన్‌పై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నేతకాని సంఘం రాష్ట్ర కన్వీనర్ టేకుమట్ల సంజయ్ కోరారు. నేతకానీల కార్పొరేషన్ ఏర్పాటుపై గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సంఘం నాయకులు కలిశారు.

సబ్సిడీపై కంది విత్తనాలు

మేడిపల్లి: సబ్సిడీపై ఎల్ఆర్‌జీ52, పీఆర్‌జీ176 రకాలైన కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి షాహిద్‌అలీ తెలిపారు. మాదం వినోద్, రమేశ్‌రెడ్డి తదితరులున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్‌నాయక్‌కు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి కీటక శాస్త్రంలో డాక్టరేట్ లభించింది.

ధర్మపురి: గ్రామీణ ప్రాంతంలోని రైతు కుటుంబంలో జన్మించిన ఓ రైతు బిడ్డ డాక్టరేట్ పట్టా సాధించినట్లు గురువారం కాకతీయ యునివర్సిటీ ప్రకటించింది. నక్కలపేట గ్రామానికి చెందిన సుద్దాల గంగాధర్–అనసూర్య దంపతుల కూతురు అనూష కాకతీయ యూనివర్సిటీ భౌతిక శాస్త్రం విభాగంలో డాక్టరేట్ సాధించింది.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

కోరుట్ల రూరల్: మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్ అన్నారు. అయిలాపూర్‌లో గురువారం వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, ఏపీవో మమత పాల్గొన్నారు.

పాము కాటుకు నాటు వైద్యం వద్దు

ఇబ్రహీంపట్నం: పాములు కాటు వేస్తే నాటు వైద్యం చేయించొద్దని వైఆర్‌కే బోర్డ్ క్యాస్టింగ్ సభ్యులు కళాబృందంతో కొత్త బస్టాండ్ వద్ద అవగాహన కల్పించారు. మనోహర్, శ్రీకాంత్, యాకన్న, తిరుపతి, గణేశ్, శంకర్, సాగర్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే..

మల్లాపూర్: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదైతే.. డబుల్ ఇళ్ల మంజూరుకు డబ్బులు వసూలు చేసిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి ముగ్గు పోశారు.

సంక్షిప్త వార్తలు

మేం బెదిరిస్తే బీఆర్‌ఎస్‌లో నలుగురే ఉంటారు

ఇబ్రహీంపట్నం: తాము బెదిరిస్తే బీఆర్‌ఎస్ పార్టీలో నలుగురే ఉంటారని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 34 మందికి రూ.12.41లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులను బెదిరించి పార్టీలో చేర్పించుకుంటున్నారని ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అనడం సరికాదన్నారు. అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే ఆ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు, కష్టపడి పనిచేసి సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను గెలిపించుకోవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, మాజీ సీడీసీ చైర్మన్ సుగుణకార్‌రావు నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

జగిత్యాల: సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. పట్టణానికి చెందిన గంగరాజుకు రూ.24వేలు, శ్యామల, రిషికకు రూ.11వేలు, ఆరవెల్లికి చెందిన రాధవ్వకు రూ.11వేల చెక్కులు మంజూరవగా.. వారికి చెక్కులు అందజేశారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన చెర్వారి ప్రియాంకకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.14,500 చెక్కును మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్ అందజేశారు.

మత మార్పిడిని ప్రోత్సహించిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన వీర్లపల్లి శివసాయి ఫిర్యాదు మేరకు పల్లపు శివ, జ్యోతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలపారు. రాజమండ్రి నుంచి వచ్చి చర్చి ఫాదర్స్ అని మత మార్పిడి కావాలని బలవంతం చేశారు. భయాందోళనకు గురైన శివసాయి గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మత మార్పిడి చేస్తున్న వ్యక్తులను స్థానికులు పోలీసులకు అప్పగించిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రాజమండ్రికి చెందిన జాన్ అబ్రహం, జ్యోతి నాగేంద్రనగర్‌కు చెందిన అంజమ్మ ఇంటికొచ్చి కొంతమంది యువతను మత మార్పిడి కోసం ఒత్తిడి పెంచారు. పట్టణానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా పట్టణ మాజీ అధ్యక్షురాలు విద్య ఠాగూర్‌సింగ్ ఇంటికొచ్చి మత మార్పిడి చేసేందుకు ప్రయత్నించగా.. ఆమె పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

టిప్పర్ పట్టివేత

కథలాపూర్: సిరికొండ గ్రామ శివారులో వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ వినోద్ గురువారం తెలిపారు. వాగు ప్రాంతంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తుండగా.. అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్న టిప్పర్ కనిపించిందన్నారు. టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

పాఠశాలలో హిందీ పోస్టు భర్తీ

సారంగాపూర్: మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రెండు రోజుల క్రితం సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ పోస్టును భర్తీ చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు లేఖ రాయగా.. స్పందించిన అధికారులు హిందీ పండిత్ పోస్టును గురువారం భర్తీ చేశారు. సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, హిందీ పండిత్ పోస్టు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టు బోధన జరగడం లేదని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు జీవన్‌రెడ్డికి వివరించారు. దీనిపై కలెక్టర్, జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో భర్తీ చేశారు.

ప్లాంట్ కోసం స్థల పరిశీలన

కోరుట్ల రూరల్: అయిలాపూర్ గ్రామ శివారులో వేస్ట్ ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ కోసం స్థలాన్ని డీఆర్‌డీవో రఘువరన్ గురువారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సేకరించిన వృథా ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసేందుకు ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. డీపీవో మదన్‌మోహన్, ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, ఈఈ పీఆర్ లక్ష్మణ్‌రావు, డిప్యూటీ ఈఈ సత్యనారాయణ, ఎంపీవో కృపాకర్, ఏఈ సుచరిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం మండలాధ్యక్షుడిగా శివ

కథలాపూర్: బీజేపీకి అనుబంధమైన బీజేవైఎం మండల శాఖ అధ్యక్షుడిగా చింతకుంట గ్రామానికి చెందిన ఆరె శివ నియమితులైనట్లు బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి గురువారం తెలిపారు. మారుతి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకుడు వెంకటేశ్వర్‌రావు అభినందించారు.

బంజార సేవాసంఘం పట్టణ అధ్యక్షుడిగా రాకేశ్

రాయికల్: ఆలిండియా బంజార సేవాసంఘం పట్టణ అధ్యక్షుడిగా భూక్య రాకేశ్‌నాయక్ ఎన్నికైనట్లు గురువారం జిల్లా అధ్యక్షుడు గోవిందునాయక్ తెలిపారు.

ఓపెన్ జిమ్‌లు మరమ్మతు చేస్తాం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్‌లకు మరమ్మతు చేయిస్తామని కమిషనర్ స్పందన అన్నారు. వివేకానంద స్టేడియం, మున్సిపల్ పార్కు, రైల్వే ట్రాక్, ధరూర్ క్యాంప్, ఎస్‌కేఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కమిషనర్‌ను కలిసి వాకర్స్ ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వినతిపత్రం సమర్పించారు. నేరేళ్ల వెంకన్న, పాత సుధాకర్, బొల్లారాం రాజయ్య, అయిల్నేని వెంకటేశ్వర్‌రావు, గుండా సురేశ్ ఉన్నారు.

ఉచిత దహన సంస్కారాలు నిర్వహించాలి

జగిత్యాలటౌన్: పట్టణ నిరుపేదల దహన సంస్కారాలను ఉచితంగా నిర్వహించాలని కోరుతూ భారత్ సురక్షా సమితి నాయకులు గురువారం బల్దియా కమిషనర్ స్పందనకు వినతిపత్రం అందజేశారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలో గురువారం కళాజాత బృందాలతో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు.